క్లుప్తంగా

ఉగ్రవాదం, మతోన్మాదంపై పోరాడాలి



అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏలూరు ఆర్ఆర్‌పేట అల్లూరి సీతారామరాజు సెంటర్ వద్ద ఉన్న అల్లూరి విగ్రహానికి నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో దేశంలో ఉగ్రవాదం, మతోన్మాదంపై పోరాడాలని పిలుపు ఇచ్చారు. సీపీఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ జిల్లా సమితి ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా సమితి అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస్ డాంగే, జిల్లా నాయకులు పి.కిషోర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎ.అప్పలరాజు, భజంత్రి శ్రీనివాస్, పి.సోమశేఖర్, రాయంకుల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి కుంకుమ పూజలు



అమ్మవారి పూజల్లో పాల్గొన్న కన్యకా పరమేశ్వరి సత్రం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రం ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి విశేష కుంకుమ పూజలు నిర్వహించారు. సత్రంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో ఆర్యవైశ్య కన్యలు పాల్గొన్నారు. అగ్రహారంలోని శ్రీ జనార్ధన నగరేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య నాయకుడు పైడి భీమేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో అభిషేకాలు, ఆర్యవైశ్య సువాసినీలచే కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి ప్రసాదంగా కుంకుమ, పసుపు, జాకెట్ ముక్కలను సత్రం ప్రతినిధులు పంపిణీ చేశారు. సత్రంలో సుమారు 2 వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సత్రం అధ్యక్షుడు దివ్వెల జయప్రకాష్ (జయబాబు), ప్రధాన కార్యదర్శి పూర రామకృష్ణారావు, కోశాధికారి దేసు నరసింహారావు, ఆర్యవైశ్య ప్రముఖులు ఎంటీవీ సత్యకుమార్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికా రాజా తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి



సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మాజీ సీఎం దామోదరం సంజీవయ్య 53 వర్ధంతి సందర్భంగా స్థానిక నవ సమాజ సొసైటీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్ర పటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తొలి దళిత ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి సంజీవయ్య పనిచేయటం దళిత జాతికి గర్వకారణమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని, మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫారెస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, కర్రె అంబేద్కర్, పోలిమెట్ల దేవ కాంతరావు, కాపుదాసి రవికుమార్, ఎరికిపాటి విజయ్, మాముడూరి మహంకాళి, సొంగా మధు, పోలిమెట్ల మోజెస్, దాసి వెంకటేశ్వర్లు, కండవల్లి స్వామి, దాసు కంచర్ల విజయ శేఖర్, బయ్యారపు వెంకటరమణ పాల్గొన్నారు.

11న ఘంటసాల స్వరపీఠం మాతృదినోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఘంటసాల స్వరపీఠం సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న మాతృదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఎస్ఎం సుభాని తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ హాల్లో ఆయన మాట్లాడుతూ స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఈ కార్యక్రమాల్లో భాగంగా మాతృమూర్తికి స్వర నీరాజనం పేరిట సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు. స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు తల్లి కమలావతి సంస్మరణార్థం పలువురు మాతృమూర్తులను సత్కరిస్తామని తెలిపారు. మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ పేద మహిళలు ఇద్దరికి కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తామని, విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పలు స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకలాపాలకు నగదు సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం 11న నిర్వహించే కార్యక్రమాల కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఘంటసాల స్వరపీఠం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, ఈటి అర్జున్ కుమార్, దేవరకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగుల నిరసన గళం

- గత ప్రభుత్వం ప్రవేశపెట్టిందనే అక్కసుతోనే రద్దు యోచన
- మళ్లీ మొదలవనున్న ఏజెన్సీల దందా
- 800 మంది ఏలూరు కార్పొరేషన్ కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన
- 20న సార్వత్రిక సమ్మెకు మద్దతు



మస్టర్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న శానిటేషన్ కార్మికులు (ఫైల్)



అడిషనల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ కార్పొరేషన్ (ఆప్కాస్) రద్దు నిర్ణయాన్ని ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సుమారు 800 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా నిరసనలు, ధర్నాలు చేశారు. ఆప్కాస్ రద్దుతో తమకు నెల నెలా ఒకటో తేదీన వేతనాలు అందవని, ప్రతినెలా పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల వాటా సొమ్ము జమకాదని ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు అనుకూల కాంట్రాక్టర్లకు ఏజెన్సీ పేరుతో అప్పజెబితే తమపై వారి పెత్తనం, తద్వారా వేధింపులు, వేతనాల్లో కోత వంటివి షరా మామూల వుతాయని ఉద్యోగులు వాపోతున్నారు.

2019లో ఆప్కాస్ ఏర్పాటు

వైఎస్సార్ సీపీ హయాంలో ఆప్కాస్ ఏర్పాటు చేశారు. దీంతో ఏలూరు కార్పొరేషన్‌లోని 800 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి లబ్ధి చేకూరింది. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు అందుతున్నాయని, పీఎఫ్, ఈఎస్ఐ సకాలంలో జమవుతున్నాయని, కనీస వేతనం అమలు చేస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. ఆప్కాస్ లేని సమయంలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా ఉండేదని, కనీస వేతనాలు అమలయ్యేవి కావని, మూడు, నాలుగు నెలలకు ఒకసారి జీతాలు చెల్లించేవారని, పీఎఫ్, ఈఎస్ఐ సరిగా జమ చేసేవారు కాదని ఉద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఏర్పాటు చేయడం వల్లే ఆప్కాస్ వ్యవస్థను కావాలనే కూటమి ప్రభుత్వం రద్దు చేసే ఆలోచనలో ఉందని విమర్శిస్తున్నారు.

20న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం

ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు ఏలూరు కార్పొరేషన్ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ సమ్మె చేస్తున్నట్టు వివిధ సంఘాల నాయకులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, సరెండర్ లీవ్స్, డీఏ, 11వ పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.35 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

కార్మికులకు తీరని ద్రోహం



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలని చూస్తే కార్మికులకు తీరని ద్రోహం చేయడమే. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం అంటే ఉద్యోగులకు భద్రత లేకుండా పోతుంది. జీత భత్యాల్లో కోత, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు స్వాహా జరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వ చర్యను ప్రతి కార్మికుడూ వ్యతిరేకించాలి. పోరాడాలి.

– బి.సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ, ఏలూరు

సమ్మెకు సంపూర్ణ మద్దతు



ఈ నెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఇఫ్టూ అనుబంధ అన్ని కార్మిక సంఘాలు మద్దతు ఇస్తున్నాయి. ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనేందుకు రంగం సిద్ధం చేస్తున్నాయి. కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నదే ప్రధాన డిమాండ్.

– బద్దా వెంకట్రావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఇఫ్టూ, ఏలూరు

ఆప్కాస్‌ను కొనసాగించాలి



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అందరినీ ఒకే ఛత్రం కిందకు తీసుకొచ్చేందుకు ఆప్కాస్ దోహదపడింది. కార్మికులకు కొద్దో గొప్పో ఉపయోగకరంగా ఉన్నా ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకోవడం పాలకుల నిరంకుశత్వానికి అద్దం పడుతుంది. తమ సొంత మనుషులకు లబ్ధి చేకూర్చే ప్రయత్నమే తప్ప ఇది మరొకటి కాదు.

– అంగులూరి జాన్ బాబు, మున్సిపల్ కార్మికుడు, పారిశుద్ధ్య విభాగం, ఏలూరు కార్పొరేషన్

సమ్మెను విజయవంతం చేద్దాం



కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను వియవంతం చేయాలి. కార్మికుల సత్తాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చూపాలి. ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల కార్మికులంతా సమ్మెలో పాల్గొనాలి.

– పి.కిషోర్, ఏఐటీయూసీ నాయకుడు, ఏలూరు

సీఎన్‌సీలో సీఆర్ఆర్ కాలేజీకి ప్రథమం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 10వ వార్షిక సిటీ నేచర్ ఛాలెంజ్-2025 (సీఎన్‌సీ)లో స్థానిక సీఆర్ రెడ్డి మహిళా కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జి.సరళ తెలిపారు. ప్రతి ఏటా ఏప్రిల్ 25 నుంచి 28 వరకు నిర్వహించే ఈ పోటీలో ప్రజలు తమ చుట్టుపక్కల ఉన్న ప్రకృతిని గమనించి ఫొటోలు తీసి, సిటీ నేచర్ ఛాలెంజ్ లింక్‌లో ఐ నేచురలిస్ట్ అప్లికేషన్ ద్వారా అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొత్తం 33264 ఫొటోలు అప్‌లోడ్ చేయగా, ఒక్క ఏలూరు నుంచి 25897 ఫొటోలు అప్‌లోడ్ చేశారని పేర్కొన్నారు. మే 5న విడుదలైన ఫలితాల్లో తమ కళాశాల రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం, జాతీయ స్థాయిలో మూడో స్థానం, అంతర్జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచిందని వివరించారు. ఈ ఘనతకు కారణమైన జువాలజీ శాఖ హెచ్ఓడీ స్వప్నను, కళాశాల విద్యార్థినులను కళాశాల కరెస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు శుభాకాంక్షలు తెలిపారని పేర్కొన్నారు.

ర్యాపిడో డ్రైవర్‌పై దౌర్జన్యం

ఏలూరు టౌన్: ఏలూరు డీ మార్ట్ వద్ద ఒక ర్యాపిడో ఆటో డ్రైవర్‌పై కొందరు ఆటో డ్రైవర్లు దౌర్జన్యానికి దిగారు. ఆటోలో ప్యాసింజర్లను తీసుకువెళితే అంతు చూస్తామంటూ బెదిరించారు. బాధితుడి, స్థానికుల కథనం మేరకు రెండు రోజుల క్రితం వట్లూరు ఇంద్ర ప్రస్థానానికి చెందిన ఓ కుటుంబం పత్తేబాద డీమార్టులో సరకులు కొనుగోలు చేశారు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు రూ.160కు ర్యాపిడో ఆటో బుక్ చేశారు. ఆ ఆటో కదులుతుండగా హఠాత్తుగా అక్కడకు కొందరు ఆటో డ్రైవర్లు వచ్చి ర్యాపిడో ఆటో డ్రైవర్‌పై బెదిరింపులకు, దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇక్కడ నుంచి కిరాయికి తీసుకువెళ్లేందుకు వీలులేదని హెచ్చరించారు. తమ కిరాయిలు పోతున్నాయని గొడవకు దిగారు. స్థానికులు సర్దిచెప్పటంతో విషయం సర్దుమణిగింది.

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీవారు



శ్రీవారి గరుడ వాహన సేవలో పాల్గొన్న అర్చకులు, అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠా మహా కుంభాభిషేకాల్లో భాగంగా బుధవారం స్వామివారికి గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుర్వేద సహిత హవనం ప్రారంభం, చతుస్థానార్చన చేశారు. 10 గంటల నుంచి శ్రీ సంతాన గోపాల హవనం అనంతరం నిత్య పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి శాత్తుమురై నిర్వహించి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీవారికి గరుడ వాహన సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు, శాత్తుమురై సమర్పించి తీర్థ ప్రసాద గోష్టి చేశారు. ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీఏవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలను పర్యవేక్షించారు.





ఏలూరులో ఎండావాన

ప్రస్తుత వాతావరణం విచిత్రంగా ఉంది. ఒక పక్క మాడు పగిలేంత ఎండ, అప్పుడప్పుడు మబ్బులు, ఓ రెండు నిమిషాలు వాన, మళ్లీఎండ ఇలా ప్రజలకు అర్థంకాని పరిస్థితిలో బుధవారం వాతావరణం ఏర్పడింది. సాధారణంగా మే నెలలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. గత రెండు రోజుల నుంచి మబ్బులు దోబూచులాడుతున్నాయి. బుధవారం ఉదయం ఎండ, మధ్యాహ్నం 12 గంటలు దాటాక ఎండలోనే వర్షం పడిన దృశ్యలివీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వీరబ్రహ్మేంద్ర స్వామి నడయాడి, సజీవ సమాధి పొందిన ప్రాంతాలను జాతీయ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా గుర్తించి అభివృద్ధి చేయాలని, ఆయన ప్రబోధాల ప్రచారానికి, అధ్యయనానికి అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధాన సంచాలకుడు అప్పలభక్తుల శివకేశవరావు (శివశ్రీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధిలో ప్రవేశించిన రోజు 332వ ఆరాధనా మహోత్సవాలను బుధవారం స్థానిక పడమరవీధి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో, పవరుపేట విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శివశ్రీ మాట్లాడుతూ యోగాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వాలు వీరబ్రహ్మేంద్ర స్వామిని మించిన యోగి లేడన్న విషయాన్ని గుర్తించాలన్నారు. 16వ శతాబ్దంలో తెలుగునాట నడయాడిన వీరబ్రహ్మేంద్ర స్వామి తన తపశ్శక్తితో యోగ దృష్టితో భవిష్యత్తు దుష్పరిణామాలను ముందుగానే దర్శించి కాలజ్ఞానంలో పొందుపరిచారని గుర్తుచేశారు. ఆధ్యాత్మిక వేత్త గొల్లపల్లి కామేశ్వరరావు వీరబ్రహ్మేంద్రస్వామి తత్వాలను పాడి వినిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దాకోజు పార్వతి వరప్రసాద్, కార్యదర్శి ముశినాడ శేఖర్, కోశాధికారి నాగమల్లి దుర్గారావు, సంఘ అధ్యక్షుడు శింహాద్రి భృంగాచార్యులు, కార్యదర్శి మానేపల్లి నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించారు.

మోదీకి ప్రజల రక్షణ కంటే బీహార్ ఎన్నికలే ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

ఏలూరు (టూటౌన్): ప్రధాని మోదీకి ప్రజల రక్షణ కంటే బీహార్ ఎన్నికలే ప్రధానంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ విమర్శించారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య అధ్యక్షతన బుధవారం పార్టీ ఏలూరు జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అక్కినేని వనజ మాట్లాడుతూ గత నెల 22న పహల్గాం దాడికి భద్రతా వైఫల్యమే కారణమని విమర్శించారు. ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా సైనికులు తీసుకునే చర్యకు సీపీఐ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఆదివాసీలను తరిమికొట్టి అటవీ ఖనిజ సంపద, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే లక్ష్యంగా కేంద్రం ఆపరేషన్ కగార్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది పెత్తనం రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. తొలుత సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకులకు సంతాపం తెలుపుతూ మౌనం పాటించారు. సమావేశంలో నాయకులు డేగా ప్రభాకర్, చలసాని వెంకట రామారావు, ఎండీ మునీర్, ఉప్పులూరి హేమ శంకర్, కారం దారయ్య, సన్నేపల్లి సాయిబాబా, మైసాక్షి వెంకటాచారి, పుప్పాల కన్నబాబు, బాడిస రాము, జేవీ రమణ రాజు, కొండేటి బేబి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణమయ పథకానికి రూ.1.08 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఏలూరుకు చెందిన భక్తుడు కొలహలం భరత్ వర్మ బుధవారం రూ.1,08,000 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. తొలుత భరత్ సతీసమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సంక్షిప్తం

మేరీ మాత ఊరేగింపు



మేరి మాత ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మహేశ్వరపురంలో బుధవారం కొల్లేటి నిష్కలంక హృదయ మేరీ మాత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జాలిపూడి ప్యారిస్ ప్రీస్ట్ ఫాదర్ తోట అంతోని రాజు ఆర్‌సీఎం చర్చిలో టవర్ వద్ద ప్రత్యేక దివ్య పూజ బలి అర్పించారు. మేరీ మాత ప్రతిమతో మహేశ్వరపురంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. సంఘ పెద్దలు, యువత సంఘస్తులు, చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం శ్రీపర్రులోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో గురువారం విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. రెండు రోజులుగా ఆలయ ఆవరణలో హోమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. ఘంటసాల ఏడుకొండల శ్రీనివాస్ అరుణ దంపతులతోపాటు మండల రాంప్రసాద్ విఘ్నేశ్వర స్వామి విగ్రహాలకు పూజలు చేశారని తెలిపింది.

ఎంపీడీఓ సుజాతకు సత్కారం

దెందులూరు: ఏలూరు ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేసి చింతలపూడి ఎంపీడీఓగా బదిలీ అయిన వై.సుజాత సేవలు అభినందనీయమని ఏలూరు జెడ్పీటీసీ మండల సరస్వతి, ఎంపీపీ శ్రీనివాసరాజు, ఏపీ వడ్డీలు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మండల కొండలరావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీలత ఆధ్వర్యంలో సుజాతను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

రీ సర్వే లక్ష్యాలను సాధించాలి

దెందులూరు: రీ సర్వే లక్ష్యాలు సాధించాలని ఏలూరు రూరల్ మండలం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగమణి అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామంలో రీ సర్వే పనులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల సర్వే పి శ్రీనివాస్, విలేజ్ సర్వేయర్లు జగదీష్, కిషోర్ సింగ్ ఉన్నారు.

చిత్రలేఖనం పోటీలు

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు విద్య క్రీడలతో పాటు చిత్రలేఖనం, సాంస్కృతిక విభాగాల్లో పోటీ పడాలని చాటపర్రు గ్రంథాలయ అధికారి వాసుకి అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు మండలం చాటపర్రు సెక్షన్‌లోని వివిధ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్న ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కోటేశ్వర దుర్గాపురం, తిమ్మారావు గూడెం, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెద్దయాగిరి మిల్లి, చిన్నయాగిరిమిల్లి, కొమడవోలు, తూర్పు లాకులు, సాయి నగర్, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

20న మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు (టూటౌన్): ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్‌కి బుధవారం సమ్మె నోటీసు అందజేశామన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు అధ్యక్షులు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.